

# శనివారమే ముహూర్తం

'దసరా' 'హాయ్ నాన్న' చిత్రాలతో వరుస విజయాలను సొంతం చేసుకున్నారు హీరో నాని. ప్రస్తుతం ఆయన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'లో నటిస్తున్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నాని, సాయికుమార్ సంప్రదాయ దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తూ కనిపిస్తున్నారు. 'వినూత్నమైన కాన్సెప్ట్ ఇది. కోపాన్ని క్రమపద్ధతిలో వాడుకుంటూ శనివారాలను మాత్రమే ముహూర్తాలుగా పెట్టుకొని శత్రువులను వేటాడే వ్యక్తిగా నాని పాత్ర కొత్త పంథాలో ఉంటుంది. ఆగస్ట్ 29న పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నాం' అని చిత్ర బృందం పేర్కొంది. ప్రియాంక అరుళ్ మోహన్, ఎస్.జే.సూర్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మురళి.జి, సంగీతం: జేక్స్ బిజోయ్, రచన-దర్శకత్వం: వివేక్ ఆత్రేయ.



# రవన్న దావత్ ఇస్తుండు..

జయాపజయాలతో నిమిత్తం లేకుండా వరుసపెట్టి సినిమాలు చేసుకుంటూ వెళ్లడం రవితేజ స్టైల్. ఆయన కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకంగా చెప్పుకునే 75వ చిత్రానికి రంగం సిద్ధమైంది. రచయిత భాను భోగవరపుని దర్శకునిగా పరిచయం చేస్తూ, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానున్న ఈ సినిమా పోస్టర్‌ని ఉగాది సందర్భంగా విడుదల చేశారు. ఓ జాతరను ఎస్టాబ్లిష్ చేస్తూ సృజనాత్మకంగా ఈ పోస్టర్‌ని మేకర్స్ డిజైన్ చేశారు. ఇది రవితేజ 75వ చిత్రం అని తెలిపే విధంగా ఈ పోస్టర్‌లో కళ్లద్దాలపై 'ఆర్‌టీ 75' అని రాయడం విశేషం. అలాగే తెలంగాణ మాండలీకంలో 'రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి.. హ్యాపీ ఉగాది రా బయ్' అని రాసి ఉండటం గమనార్హం. పోస్టర్ పోకడను బట్టి ఇది తెలంగాణ నేపథ్యంతో కూడిన సినిమా అని తెలుస్తున్నది. ఇందులో రవితేజ పాత్ర పేరు 'లక్ష్మణ్ భేరి'. ఆ కేరక్టరైజేషన్‌ని ఉగాది పంచాంగం రూపంలో పోస్టర్ ద్వారా చెబుతూ.. 'ఆదాయం.. చెప్పను తియ్. ఖర్చు.. లెక్క జెయ్యన్. రాజ్యపూజ్యం.. అన్ లిమిటెడ్. అవమానం.. జీరో' అంటూ రవితేజ స్టైల్‌లో చెప్పిన తీరు బావుంది. ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ ఘట్టమనేని, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఎడిటింగ్: నవీన్ నూలి, సమర్పణ: శ్రీకర స్టూడియోస్.

# వెంకీ క్రైమ్ ఎంటర్‌టైనర్



ఎఫ్-2, ఎఫ్-3 చిత్రాలతో ప్రేక్షకులకు చక్కటి వినోదాన్ని అందించారు అగ్ర హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ క్రైమ్ ఎంటర్‌టైనర్ రాబోతున్నది. ఉగాది సందర్భంగా మంగళవారం సినిమా ప్రకటన వెలువడింది. ఈ చిత్రాన్ని శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై అగ్ర నిర్మాత దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించనున్నారు. 'ట్రయాంగ్యులర్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇది. హీరో, అతని భార్య, మాజీ ప్రేయసి మధ్య నడిచే కథ ఇది. కాన్సెప్ట్ వైవిధ్యంగా ఉంటుంది. క్రైమ్ ఎలిమెంట్‌తో పాటు కామెడీతో మెప్పిస్తుంది. భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తాం. 2025 సంక్రాంతికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.



# కమిటీ కుర్రాళ్ల హంగామా


ఓ వైపు నటన, మరో వైపు చిత్ర నిర్మాణం అంటూ బిజీబిజీగా ఉంటున్నది మెగా డాటర్ నిహారిక కొణిదెల. ఆమె సమర్పణలో యదు వంశీ దర్శకుడిగా, పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రానికి 'కమిటీ కుర్రాళ్లు' అనే పేరును ఖరారు చేశారు. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాథ్‌వర్మ, ప్రసాద్ బెహరా, మణికంఠ పరసు, లోకేశ్ కుమార్ పరిమి, శ్యామ్ కల్యాణ్, రఘునందన్, శివకుమార్ మట్ట, అక్షయ్ శ్రీనివాస్, శరణ్య సురేశ్, తేజస్విరావు, టీన శ్రావ్య, విషిక, షణ్ముఖి నాగమంత్రి ప్రధాన పాత్రధారులు. ఉగాది సందర్భంగా ఈ చిత్రం టైటిల్ పోస్టర్‌ని హీరో సాయిదుర్గతేజ్ ఆవిష్కరించి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయడం బాధ్యతగా భావిస్తున్నాను. 'కమిటీ కుర్రాళ్లు' అనే టైటిల్ ఈ కథకు యాప్ట్. తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుంది' అని నిహారిక నమ్మకం వెలిబుచ్చారు. చిత్రీకరణ పూర్తయిందని, ఇందులో 11మంది హీరోలను, 4 హీరోయిన్లను పరిచయం చేస్తున్నామని దర్శకుడు తెలిపారు. మంచి కంటెంట్ ఉన్న సినిమాలను మాత్రమే నిర్మిస్తామని, విభిన్న కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని, త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురోలు, సంగీతం: అనుదీప్ దేవ్.

# ద్వేషించినా సరే ప్రేమించాలి!

'ప్రేమ అనేది లావాదేవీ కాదు..ఇచ్చిపుచ్చుకోవడానికి. మనల్ని ప్రేమించకున్నా మనం ప్రేమించడమే నిజమైన ప్రేమ. ఇదే అంశాన్ని భావోద్వేగభరితంగా 'లవ్‌గురు' చిత్రంలో ఆవిష్కరించాం' అన్నారు విజయ్ ఆంటోని. ఆయన కథానాయకుడిగా వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 11న మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని పంచుకున్న సినిమా విశేషాలు..



- ప్రేమను విభిన్న కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. ఈ సినిమా చూశాక జీవిత భాగస్వామిని ప్రేమించడం ఎలాగో నేర్చుకుంటారు. ఓ జంట పెళ్లి చేసుకుంటారు. కొద్ది రోజుల తర్వాత భార్యకు భర్తపై ఏమాత్రం ఇష్టం లేదని తెలుస్తుంది. అయినా తనను అర్థం చేసుకుంటుందని భర్త ఆశిస్తాడు. కానీ ఆమె అతన్ని ఎప్పటికీ ప్రేమించదు. ఈ పరిస్థితుల్లో హీరో ఏం చేశాడు? వారి బంధం ఏ తీరానికి చేరిందన్నదే సినిమాలో ఆసక్తికరమైన అంశం.
- ప్రేమ భావన ఎప్పుడైనా మంచే చేస్తుంది. అందుకే నెగెటివ్ మైండ్ సెట్ ఉన్న వ్యక్తులతో కూడా మనం పాజిటివ్‌గా ఉండేందుకు ప్రయత్నించాలి. మనల్ని మోసం చేసిన వారు ఏదో ఒకరోజు తప్పు తెలుసుకుంటారు. ఈ కథలోని హీరో పాత్ర కూడా ద్వేషించిన వారిని ప్రేమిస్తుంటుంది. దర్శకుడు తన నిజ జీవితంలో చూసిన అనుభవాలతో ఈ కథ రాసుకున్నాడు. సంభాషణలన్నీ సహజంగా ఉంటాయి.
- నేను తెలుగు నేర్చుకోలేకపోయాను. ఒకవేళ తెలుగు వచ్చి ఉంటే హైదరాబాద్‌లో సెటిలైపోయి ఇక్కడే స్ట్రెయిట్ సినిమాలు చేసేవాడిని. ఇక నా తదుపరి సినిమాల గురించి చెప్పాలంటే..2026వ వేసవిలో 'బిచ్చగాడు-3' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నది. ఈ సినిమాకు నేనే దర్శకత్వం వహిస్తా. ప్రస్తుతం మా ప్రొడక్షన్‌లో మూడు సినిమాలు లైనప్‌లో ఉన్నాయి.



# మరోమారు నవ్వుల జాతర

శ్రీవిష్ణు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రారంభోత్సవం జరుపుకుంది. జానకిరామ్ మారెళ్ల దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర నిర్మాత దిల్ రాజు క్లాప్‌నివ్వగా, అనిల్ రావిపూడి కెమెరా స్విఛాన్ చేశారు.ఫన్, అడ్వెంచర్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా తెరకెక్కనుందని, ఈ చిత్రం ద్వారా దర్శకుడు బాబీ నిర్మాణరంగంలోకి ప్రవేశించడం ఆనందంగా ఉందని హీరో శ్రీవిష్ణు పేర్కొన్నారు. కడుపుబ్బా నవ్వించే వినోదాత్మక కథాంశంతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, తన అభిరుచులను ప్రతిబింబించే సినిమాలు నిర్మించాలనే లక్ష్యంతో ప్రొడక్షన్‌లోకి ఎంట్రీ ఇచ్చానని దర్శకుడు బాబీ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్, సంగీతం: విజయ్ బుల్గానిన్, సమర్పణ: కోన వెంకట్, బాబీ కొల్లి, నిర్మాతలు: అనూష ద్రోణవల్లి, సీతాకుమారి, గోపాలం లక్ష్మీ దీపక్, దర్శకత్వం: జానకిరామ్ మారెళ్ల.

# మౌళీగా నవదీప్‌ని తప్ప వేరొకర్ని ఊహించలేం



నవదీప్ హీరోగా నటిస్తున్న చిత్రం 'లవ్, మౌళి'. అవనీంద్ర దర్శకత్వంలో సి.స్పేస్, నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం మంగళవారం జరిగింది. హీరో విశ్వక్‌సేన్ అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ని విడుదల చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'దర్శకుడు అవనీంద్ర నాకీ కథ చెప్పి, నన్ను గడ్డం చేసుకోవద్దు, జుట్టు పెంచు, బాడీ బిల్డ్ చెయ్ అని చెప్పాడు. ఏడాది పాటు అదే పనిలో ఉన్నాను. నా కష్టాన్ని చూసిన నా ఫ్రెండ్స్ 'నీకేం కావాలిరా..' అని అడిగి ఈ సినిమాకు వాళ్లు చేయవలసింది చేశారు. నిజానికి వాళ్లు లేకపోతే ఈ సినిమా లేదు. ఈ సినిమాకు అన్నీ కలిసొచ్చాయి. కొత్త కథ, తగ్గ లొకేషన్స్ కుదిరాయి' అని నవదీప్ తెలిపారు. ' ఈ కథలో మౌళీ పాత్రకు నవదీప్ కరెక్ట్. మరొకర్ని ఊహించలేం. 'లవ్, మౌళి'ని నవదీప్ ఎంత ప్రేమించాడంటే, అసిస్టెంట్ డైరెక్టర్‌గా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, హీరోగా, కొన్ని సార్లు ఆఫీస్ బాయ్‌గా కూడా వ్యవహరించాడు. తన ప్రేమకు తగ్గ ఫలితం ఈ సినిమా ఇస్తుందని నమ్ముతున్నాను' అని దర్శకుడు తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

# సూపర్‌హీరో కాన్సెప్ట్‌తో..



మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ కలగలిసిన కొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న చిత్రం 'ఏ మాస్టర్ పీస్'. అరవింద్ కృష్ణ, జ్యోతి పూర్వాజ్, అషురెడ్డి ప్రధానపాత్రధారులు. సుకు పూర్వజ్ దర్శకుడు. శ్రీకాంత్ కండ్రేగుల, మనీశ్ గిలాడ, ప్రజయ్ కామత్ నిర్మాతలు. క్లైమాక్స్ మినహా చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఉగాది సందర్భంగా ఈ సినిమా ప్రకటనను మేకర్స్ విడుదల చేశారు. అద్భుతమైన విజువల్స్, భారీ మేకింగ్ వేల్యూస్‌తో 'ఏ మాస్టర్ పీస్' తెరకెక్కుతున్నదని, ఇదో అత్యున్నత సాంకేతిక విలువలతో కూడిన సూపర్‌హీరో సినిమా అని మేకర్స్ తెలిపారు. స్నేహా గుప్త, అర్చనా అనంత్, జయప్రకాశ్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శివరామ్ చరణ్, సంగీతం: అశీర్వాద్, సుమన్ జీవ రతన్, నిర్మాణం: సినిమా బండి, మెర్జ్ ఎక్స్ ఆర్.

# ప్రశ్నించే 'ప్రతినిధి- 2'



నారా రోహిత్ నటించిన రాజకీయ నేపథ్య చిత్రం 'ప్రతినిధి'. పదేళ్ల క్రితం విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలందుకుంది. దాంతో ఆ సినిమాకు సీక్వెల్‌గా రూపొందిన 'ప్రతినిధి 2' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రముఖ జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తపును దర్శకుడిగా పరిచయం చేస్తూ కుమార్ రజాబత్తుల, ఆంజనేయులు శ్రీతోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ విషయాన్ని ఉగాది సందర్భంగా నిర్మాతలు ప్రకటించారు. కొద్దిరోజుల క్రితం విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన వస్తున్నదని, సినిమా అంతకు మించిన స్థాయిలో ఉంటుందని, నారా రోహిత్ ఇంటెన్స్ పెర్‌ఫార్మెన్స్ సినిమాకు హైలైట్‌గా నిలువనుందని నిర్మాతలు తెలిపారు. నిజాయితీ గల న్యూస్ రిపోర్టర్‌గా నారా రోహిత్ నటిస్తున్న ఈ చిత్రంలో సిరీ లెల్లా కథానాయిక. దినేష్ తేజ్, సప్తగిరి, జిషు సేన్‌గుప్తా, సచిన్ ఖేడేకర్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: నాని చమిడిశెట్టి, సంగీతం: మహతి స్వరసాగర్.

# తెలంగాణ నేపథ్య డిటెక్టివ్ సిరీస్

నరేష్ ఆగస్త్య, మేఘా ఆకాష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్‌సిరీస్ 'వికటకవి'. ఎస్.ఆర్.టి. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ప్రదీప్ మద్దాలి దర్శకుడు. యాభైశాతం చిత్రీకరణ పూర్తయింది. తెలంగాణ నేపథ్యంలో వస్తున్న తొలి డిటెక్టివ్ సిరీస్ ఇది. తెలంగాణలోని అమరగిరి అనే గ్రామాన్ని 30 ఏళ్లుగా ఓ శాపం పట్టిపీడిస్తుంటుంది. ఆ గ్రామానికి డిటెక్టివ్ రామకృష్ణ వెళతాడు. అక్కడి పురాతన కథలను, కుట్రల వెనకున్న రహస్యాలను బయటపెడతాడు. ఈ క్రమంలో అతనికి ఎదురయ్యే సవాళ్లేమిటన్నదే ఈ సిరీస్ ఇతివృత్తం. ఇప్పటివరకు రానటువంటి డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ సిరీస్‌ను రూపొందిస్తున్నామని, జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ చేయబోతున్నామని నిర్మాత తెలిపారు.





# ఆధ్యాత్మిక, సాహసోపేత నాగబంధం

నిర్మాత అభిషేక్ నామా 'డెవిల్' సినిమాతో దర్శకుడిగా మారిన విషయం తెలిసిందే. ఆయన దర్శకత్వంలో మరో సినిమా తెరకెక్కుతున్నది. సినిమా పేరు 'నాగబంధం'. 'ది సీక్రెట్ ట్రెజర్' అనేది ఉపశీర్షిక. ఆధ్యాత్మిక, సాహసోపేత అంశాలతో అభిషేక్ నామా తయారు చేసుకున్న స్క్రిప్ట్ ఇది. 'కేజీఎఫ్'ఫేం అవినాష్ ఇందులో మిస్టీరియస్ అఘోరగా నటిస్తున్నాడు. ఉగాది సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ని ప్రకటిస్తూ మేకర్స్ ఓ వీడియోను విడుదల చేశారు. సాంకేతికంగా మరోస్థాయిలో ఈ సినిమా ఉంటుందని, అనుభవజ్ఞులైన సాంకేతికనిపుణులు ఈ సినిమాకు పనిచేస్తున్నారని, హై బడ్జెట్‌లో సాహసాల ప్రపంచంలోకి తీసుకెళ్లేలా సినిమా ఉంటుందని, వచ్చే ఏడాది తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేయనున్నామని అభిషేక్ నామా చెప్పారు. ఈ చిత్రానికి మాటలు: శ్రీకాంత్ విస్సా, కెమెరా: సౌందర్‌రాజన్, సంగీతం: అభే, నిర్మా: మధుసూదన్‌రావు, సమర్పణ: దేవాన్ష్ నామా.

